
Toli Velugu 22.01.26_Layout 1 1/22/2026 8:38 AM Page 1


# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

**మంచిమాట**

పదునైన ఆయుధం కంటే
క్షణ కాలంలో వచ్చే కోపమే
అత్యంత ప్రమాదకరం

~ రామకృష్ణ పరమహంస

నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 14 | పేజీలు : 5 | గురువారం 22 జనవరి 2026 | వెల : 2/-

# రేవంత్ రెడ్డిలో రామూ, రెమో.. ఇద్దరూ ఉన్నారు

## - కేటీఆర్

- సినిమా టిక్కెట్లు పెంచబోమని చెబుతూనే, ధరల పెంపుకు జీవో జారీ చేస్తారని విమర్శ
- సర్వాయి పాపన్న పేరుపై జిల్లా చేస్తామని చెబుతూనే జనగామ జిల్లాను తొలగిస్తామంటున్నారని ఆగ్రహం
- మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామన్న కేటీఆర్
- జనసేన సహా ఏ పార్టీ అయినా పోటీ చేయవచ్చని స్పష్టీకరణ



డెస్క్, జనవారి 21 (తొలివెలుగు) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో రెండు కోణాలు ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఒకటి 'రాము' అయితే, మరొకటి 'రెమో' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈరోజు విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఒకవైపు సినిమా టిక్కెట్లను పెంచబోమని చెబుతూనే, మరోవైపు టిక్కెట్ ధరలు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేస్తోందని అన్నారు. సర్వాయి పాపన్న పేరు మీద జనగామ జిల్లాను ఏర్పాటు చేస్తామని చెబుతూనే, తిరిగి అదే జిల్లాను తొలగిస్తామని చెబుతున్నారని విమర్శించారు. అందుకే ఆయనలో రాము, రెమో కోణాలు ఉన్నాయని చెబుతున్నామని పేర్కొన్నారు.

### మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం

మున్సిపల్ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి స్వయంగా ప్రచారం చేసినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి ఆశించిన ఫలితం రాలేదని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో తాము 40 శాతం సర్పంచ్‌లను గెలుచుకున్నామని, మున్సిపల్ ఎన్నికల్లోనూ మెజారిటీ స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలు శివరాత్రి లోపలే ముగుస్తాయని అభిప్రాయపడిన కేటీఆర్, తాము ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే ఆలోచన ప్రభుత్వానికి లేదని అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత వచ్చేది అసెంబ్లీ ఎన్నికలేనని జోస్యం ....

2

# ప్రపంచంలోనే తొలి స్విస్ మాల్..!

## హైదరాబాద్ లో



డెస్క్, జనవరి 21 (తొలివెలుగు) : ప్రపంచ ఆర్థిక వేదిక 2026 సందర్భంగా దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్విట్జర్లాండ్‌లోని వాడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి క్రిస్టెల్ లూసియర్ బ్రోడార్ తో సమావేశమయ్యారు. భారత్--స్విట్జర్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య సహకార పెంపుపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ తెలంగాణ రైజింగ్--2047 విజన్‌ను స్విస్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలిసారి 'స్విస్ మాల్' ఏర్పాటు చేయాలనే ఆలోచనను ముఖ్యమంత్రి ప్రతిపాదించగా, స్విస్ బృందం సానుకూలంగా స్పందించింది. ఇద్దరు ముఖ్యమంత్రులు ఫుట్‌బాల్ క్రీడాకారులే కావడంతో, క్రీడల రంగంలో భాగస్వామ్యంపై కూడా విస్తృతంగా చర్చించారు. క్రీడా శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధిలో కలిసి పనిచేయవచ్చని అభిప్రాయపడ్డారు. సంస్కృతి, విద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ రంగాల్లో, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, క్రీడల విభాగాల్లో పరస్పర సహకారానికి అవకాశాలపై ఇద్దరు ముఖ్యమంత్రులు అభిప్రాయాలు పంచుకున్నారు. రిటైల్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అవకాశాలపై చర్చించారు. మహిళా సాధికారతకు సంబంధించి స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలపై స్విస్ బృందం ఆసక్తి కనబరిచింది. పరస్పర సహకార అంశాలు పరిశీలించేందుకు త్వరలోనే స్విట్జర్లాండ్ బృందం హైదరాబాద్‌లో పర్యటిస్తుందని వాడ్ రాష్ట్ర పరిశ్రమలు, ఆర్థిక శాఖ మంత్రి ఇసబెల్ మోరెట్ తెలిపారు.

# కేటీఆర్ అలా చెబుతుంటే నవ్వు వచ్చింది : కవిత

- సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయమని కేటీఆర్ డిమాండ్ చేయడంపై విమర్శ
- పదేళ్లు అధికారంలో ఉండి సికింద్రాబాద్ కోసం ఉద్యమించిన వారిని జైల్లో వేశారని ఆరోపణ
- ఈరోజు కేటీఆర్ జిల్లాగా చేయాలని డిమాండ్ చేస్తుంటే నవ్వు వస్తోందని వ్యాఖ్య



వివరాలు 2 లో..

# మున్సిపల్ ఎన్నికలకు ముందు..
# 47 మంది కమిషనర్ల బదిలీ



- ఎస్ఈసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు
- సొంత జిల్లాల్లో పని చేస్తున్నవారు, ఒకేచోట సుదీర్ఘకాలం పని చేస్తున్న వారు బదిలీ
- బదిలీ అయిన అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రభుత్వం

మిగతా 2 లో..

# ఇక నింగికి వీడ్కోలు..

## 'స్టార్' ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్ పదవీ విరమణ!

- ముగిసిన సునీత 27 ఏళ్ల అద్భుత ప్రస్థానం
- నాసాలో మూడు కీలక మిషన్లు చేపట్టిన సునీత
- సుదీర్ఘ సేవ తర్వాత సునీతా విలియమ్స్ రిటైర్మెంట్
- స్పేస్‌లో అత్యధిక కాలం గడిపిన మహిళా వ్యోమగాముల్లో ఒకరిగా అరుదైన రికార్డు
- అత్యధిక సార్లు అంతరిక్షంలో నడిచిన మహిళగా చరిత్ర సృష్టించిన సునీత



డెస్క్, జనవరి 21 (తొలివెలుగు) : అంతరిక్ష పరిశోధన రంగంలో ఒక శకం ముగిసింది. భారత సంతతికి చెందిన ధీశాలి, నాసా స్టార్ వ్యోమగామి సునీతా విలియమ్స్ (60) అంతరిక్ష ప్రయాణాలకు వీడ్కోలు పలికారు. ఆమె పదవీ విరమణ చేస్తున్నట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) అధికారికంగా ప్రకటించింది. నిజానికి గతేడాది డిసెంబరు 27 నుంచే ఈ రిటైర్మెంట్ అమలులోకి వచ్చినట్లు వెల్లడించింది.

**రికార్డుల రారాణి :** 1998లో నాసాలో చేరిన సునీత తన 27 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మైలురాళ్లను అధిగమించారు. మొత్తం మూడు అంతరిక్ష యాత్రల్లో పాల్గొన్న ఆమె కక్ష్యలో 608 రోజుల పాటు గడిపారు. నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మాన్ ఆమెను 'మానవ అంతరిక్ష ప్రయాణాల్లో ఒక మార్గదర్శి' గా అభివర్ణించారు. అంతరిక్షంలో మారథాన్ రన్ చేసిన మొదటి వ్యక్తిగా కూడా ఆమె రికార్డు సృష్టించారు.

2

# తెలంగాణకు గుడ్ న్యూస్..
# 6 అర్బన్ ఫారెస్ట్ పార్కుల ఏర్పాటుకు లైన్ క్లియర్




హైదరాబాద్ జనవరి 21 (తొలివెలుగు) : పచ్చదనాన్ని మరింత పెంచే లక్ష్యంతో 'నగర్ వన్ యోజన' పథకం కింద తెలంగాణలో కొత్తగా 6 అర్బన్ ఫారెస్ట్ పార్కుల ఏర్పాటుకు పరిపాలనా అనుమతులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుల కోసం 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ, తొలి విడతగా రూ. 8.26 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేసింది. ఆదిలాబాద్, మంచిర్యాల, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఈ కొత్త పార్కులు అందుబాటులోకి రానున్నాయి. నగర కాలుష్యాన్ని తగ్గించడమే ఈ పార్కుల ప్రధాన ఉద్దేశం.

# బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని కవితనే చెప్పారు - పొన్నం ప్రభాకర్

- కవిత ఆరోపణలకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలన్నమంత్రి
- సింగరేణిపై బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- హిల్ట్ పాలసీపై అసెంబ్లీలో చర్చ పెడితే బహిష్కరించి వెళ్లిపోయారన్న మంత్రి

డెస్క్, జనవరి 21 (తొలివెలుగు) : బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఎంతో అవినీతి జరిగిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కవిత లేవనెత్తిన ప్రశ్నలకు, ఆమె చేసిన ఆరోపణలకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 30 శాతం అధిక కేటాయింపులతో టెండర్లను అప్పగించిందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్టులు పొందిన వ్యక్తులు ఇప్పుడు వారికి చెడ్డవారయ్యారా అని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీపై కూడా బీఆర్ఎస్ నాయకులు ఇలాగే ఆరోపణలు చేశారని, అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇస్తే బహిష్కరించి వెళ్లిపోయారని ఆయన విమర్శించారు.



# రేవంత్ రెడ్డిలో రాము, రెమో.. ఇద్దరూ ఉన్నారు - కేటీఆర్

మొదటిపేజీ తరువాయి..

చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను, రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిన మాటలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. సర్వేలు, పార్టీ బలాబలాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో జనసేనతో సహా ఎవరైనా పోటీ చేయవచ్చని అన్నారు. క్షేత్రస్థాయిలో బలం ఉంటేనే స్థానిక ఎన్నికల్లో గెలవడం సులభమవుతుందని అన్నారు. జనగామ, నారాయణపేట సహా పలు జిల్లాలను ఎత్తివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే జిల్లాలను రద్దు చేయడం ఖాయమని అన్నారు. స్థానిక సమస్యల ఆధారంగానే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేస్తారని ఆయన అన్నారు. ఫార్ములా ఈ రేసు, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో అధికార పార్టీ నాయకులు ఆరోపణలను నిరూపించలేకపోయారని విమర్శించారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలనతో జంట నగరాల అస్థిత్వం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలను తొలగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం





చూస్తోందని, దీనిని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల్లోకి తీసుకువెళతామని అన్నారు.

# ఇక నింగికి వీడ్కోలు..

## 'స్టార్' ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్ పదవీ విరమణ!

మొదటిపేజీ తరువాయి..




**ముగిసిన స్టార్‌లైనర్ ఉత్కంఠ :** ఆమె కెరీర్‌లో చివరి మిషన్ అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. 2024 జూన్‌లో బోయింగ్ స్టార్‌లైనర్ ద్వారా కేవలం 10 రోజుల పర్యటన కోసం వెళ్లిన సునీత, అంతరిక్ష నౌకలో సాంకేతిక లోపాల వల్ల అక్కడే చిక్కుకుపోయారు. ఆ 10 రోజుల యాత్ర కాస్తా 286 రోజుల సుదీర్ఘ నిరీక్షణగా మారింది. ఎట్టకేలకు 2025 మార్చి 18న స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ ద్వారా ఆమె క్షేమంగా భూమికి చేరుకున్నారు. ఈ సుదీర్ఘ నిరీక్షణ ఆమె మనోధైర్యానికి నిదర్శనంగా నిలిచింది.

**స్ఫూర్తిదాయకం :** సునీతా విలియమ్స్ పదవీ విరమణ చేసినా, ఆమె చేసిన పరిశోధనలు భవిష్యత్తులో జరగబోయే 'ఆర్టెమిస్' (చందమామపైకి పంపే మిషన్), అంగారక గ్రహ యాత్రలకు పునాదిగా నిలుస్తాయని నాసా పేర్కొంది. ప్రస్తుతం ఆమె భారత్ పర్యటనలో వున్నారు. తన తండ్రి స్వదేశమైన భారత్‌తో కలిసి ఇస్రో ప్రాజెక్టులలో ఏవైనా సలహాలు అందించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు ముందు..
# 47 మంది కమిషనర్ల బదిలీ

మొదటిపేజీ తరువాయి..

**డెస్క్, జనవరి 21 (తొలివెలుగు) :** 2026 మున్సిపల్ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహించేందుకు జీహెచఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఈ బదిలీలు చేపట్టింది. ఈ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎసచఎసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది.

సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారు, ఒకేచోట సుదీర్ఘ కాలం పనిచేస్తున్న అధికారులను పరిపాలనాపరమైన కారణాలతో పాటు పదోన్నతులపై బదిలీ చేసింది.

సి.వి.ఎన్. రాజు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-3) నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. జి.రాజు క్యాతనపల్లి నుంచి ఆదిలాబాద్ మున్సిపాల్ కమిషనర్‌గా, ముసాబ్ అహ్మద్ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా, బి.శ్రీనివాస్ ఆలేరు నుంచి హుజూర్ నగర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. బి.శరత్ చంద్ర ప్రమోషన్‌పై నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్లనున్నారు. బదిలీ అయిన అధికారులు



వెంటనే తమకు కేటాయించిన కొత్త ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై దాడిని ఖండించిన కేటీఆర్

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడిపై దాడి
- దాడికి పాల్పడిన మల్లు రవి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్‌కు గౌరవం లేదని మండిపాటు



**డెస్క్, జనవరి 21 (తొలివెలుగు) :** అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. విజయుడిపై కాంగ్రెస్ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి చేసిన ఈ దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడి అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాన్ని భయపెట్టేందుకు, గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారిన రాజకీయానికి పాల్పడుతున్నారనడానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. ప్రజల చేత ఎన్నికైన ఎమ్మెల్యేను అవమానిస్తూ శారీరక దాడికి దిగడమనేది... కాంగ్రెస్ ఎంత దిగజారిందో స్పష్టంగా చూపుతోందని కేటీఆర్ మండిపడ్డారు. చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్‌కు గౌరవం లేదని మండిపడ్డారు. ఈ దాడిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఎంపీ మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సీఎం రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిపక్షాన్ని బెదిరింపులతో కాదు, ప్రజల తీర్పుతోనే ఎదుర్కోవాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తూ, ప్రజాస్వామ్య పద్ధతుల్లో గట్టిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఘటన వివరాల్లోకి వెళితే... జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడ్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. భూమిపూజలో ముందుగా ఎంపీ కొబ్బరికాయ కొట్టగా, అనంతరం ఎమ్మెల్యే పనులు ప్రారంభించేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొబ్బరికాయ కొట్టేందుకు ముందుకు రావడంతో ప్రోటోకాల్ లేని వ్యక్తులతో ఎలా కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీని, ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇది వివాదానికి దారి తీసింది.

# కేటీఆర్ అలా చెబుతుంటే నవ్వు వచ్చింది : కవిత

మొదటిపేజీ తరువాయి..

**డెస్క్, జనవరి 21 (తొలివెలుగు)** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు చేశారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవ్ సికింద్రాబాద్' ర్యాలీకి కేటీఆర్ మద్దతు తెలిపారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలన్న కేటీఆర్ డిమాండ్‌పై కవిత స్పందిస్తూ, "కేటీఆర్ సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలని ఉద్యమిస్తుంటే నాకు నవ్వు వస్తోంది. సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలని డిమాండ్ చేసిన వారిని పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు అణిచివేశారు, జైళ్లలో వేశారు. కానీ, ఇప్పుడు కేటీఆర్ వెళ్లి సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయమని మాట్లాడుతున్నారు" అని విమర్శించారు.

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీపై కవిత స్పష్టత**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేసే విషయమై కవిత మాట్లాడుతూ,




జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని, అందుకే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని అన్నారు. అయితే, ఎన్నికల్లో మద్దతు కావాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యువత, మహిళలు కోరితే అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. రాజకీయాల్లోకి రావాలనుకునే వారు మున్సిపల్ ఎన్నికలను ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, యువత, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు రాజకీయాల్లోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు.

# మూసీ వెంట 120 అడుగుల 'మోడల్ కారిడార్'

## - మారిపోనున్న రూపరేఖలు



**డెస్క్, జనవరి 21 (తొలివెలుగు) :** భాగ్యనగర వాసుల ట్రాఫిక్ కష్టాలను తీరుస్తూ మూసీ నదికి పూర్వ వైభవం తెచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మూసీ తీరం వెంబడి 120 అడుగుల వెడల్పుతో అత్యాధునిక 'మోడల్ కారిడార్' నిర్మాణానికి జీహెచ్ఎంసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. అంబర్‌పేట ఎస్టీపీ నుంచి నాగోల్ మెట్రో స్టేషన్ వరకు సాగే ఈ రహదారి నిర్మాణానికి రూ. 160 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రతిపాదన రేపు జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చకు రానుంది.

**తొలి దశలో ఉప్పల్ భగాయత్ వరకు :** ఈ ప్రాజెక్టులో భాగంగా మొదటి దశలో ఎస్టీపీ నుంచి ఉప్పల్ భగాయత్ డీ-మార్ట్ వరకు 2.7 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నారు. ఈ మార్గంలో రామాంతపూర్ కేసీఆర్ నగర్ వద్ద ఉన్న నాలాపై కొత్తగా బ్రిడ్జిని నిర్మిస్తారు. కేవలం వాహనాల రాకపోకలకే కాకుండా, ఈ రహదారి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్లు, సైకిల్ ట్రాక్‌లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్నందున, కొంత మేర ఆస్తుల సేకరణ కూడా అవసరమని అధికారులు భావిస్తున్నారు.

**వరంగల్ హైవేపై తగ్గనున్న ఒత్తిడి:** ప్రస్తుతం గోల్నాక, అంబర్‌పేట, రామాంతపూర్ ప్రజలు సికింద్రాబాద్ లేదా వరంగల్ వైపు వెళ్లాలంటే ఉప్పల్ మెయిన్ రోడ్డుపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ కొత్త 120 అడుగుల రోడ్డు అందుబాటులోకి వస్తే, హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. అంతేకాకుండా, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా ఈ రహదారి నగరం రూపురేఖలను మార్చనుంది. మూసీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే విదేశీ నదుల అభివృద్ధి నమూనాలను పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల భవిష్యత్తులో మూసీ నది ఆక్రమణలు కూడా అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవం



చౌటుప్పల్, జనవరి 21 (తొలివెలుగు) : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో విద్యుత్ సరఫరా మెరుగుదల కోసం ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ప్రారంభించారు. వార్డులోని కంచరకుంట్ల శశిధర్ రెడ్డి నివాసం ఎదుట ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు ప్రజల అవసరాలను గుర్తించి, విద్యుత్ అంతరాయం కలగకుండా ఈ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య గౌడ్, బొబ్బిళ్ళ మురళి, చింతల సాయిలు, పాక చిరంజీవి, చేవగోని వెంకటేష్ గౌడ్, వివిధ వార్డుల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు వరం 'రాయితీ' యంత్రాలు

- ఆర్‌కేవీవై పథకం కింద యంత్ర పరికరాల పంపిణీ
- 50 శాతం రాయితీతో రైతులకు ఆధునిక పనిముట్లు







చౌటుప్పల్, జనవరి 21 (తొలివెలుగు) : వ్యవసాయంలో ఆధునిక యంత్రాలను వినియోగించడం ద్వారా పనిభారం తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. బుధవారం చౌటుప్పల్ మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకం కింద 50 శాతం రాయితీతో మంజూరైన వ్యవసాయ యంత్ర పరికరాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చౌటుప్పల్ మండలానికి రూ. 8.5 లక్షలు, నారాయణపూర్ మండలానికి రూ. 4.5 లక్షల విలువైన రాయితీ యంత్ర పరికరాలను రైతులకు అందజేశామని తెలిపారు. గతంలో యంత్రాలు లేక వ్యవసాయం చేయడం వల్ల రైతులపై అధిక శ్రమ భారం ఉండేదని, ఇప్పుడు ఆధునిక పరికరాలతో వ్యవసాయం సులభంగా మారిందన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వరి, పత్తి, కంది వంటి పంటల అవశేషాలను తగలబెట్టడం వల్ల భూసారం తగ్గుతుందని తెలిపారు. రోటవేటర్, మల్టీ క్రాప్ ష్రెడర్ వంటి యంత్రాలతో పంట అవశేషాలను భూమిలోనే కలియదున్నడం ద్వారా సేంద్రియ కార్బన్ పెరిగి నేల సారవంతమవుతుందని, దీని వల్ల అధిక దిగుబడులు సాధ్యమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మండలానికి చెందిన నీదామెర సర్పంచ్ సాతిరి శ్రీధర్, ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నరసింహ, మహ్మదాబాద్ సర్పంచ్ ముత్యాల అంజయ్య, చిమిర్యాల సర్పంచ్ ఉప్పల రమేష్, లచ్చమ్మగూడెం సర్పంచ్ తోటకూర శంకర్‌తో పాటు ఉప సర్పంచులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, యంత్ర పరికరాల లబ్ధిదారులు, రైతులు, డీలర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# లైసెన్స్ లేనిదే వాహనం ఎక్కితే.. జైలుకే!







- మైనర్లు బండి తీస్తే.. పేరెంట్స్ కు జైలే!
- రోడ్డు ప్రమాదాల నివారణకు త్రినిటీ విద్యార్థుల నడుం బిగించాలి
- రోడ్డు భద్రతపై విద్యార్థులకు పోలీసు, రవాణా శాఖల అవగాహన
- చౌటుప్పల్ లో రోడ్డు భద్రత మాసోత్సవాలు

చౌటుప్పల్, జనవరి 21 (తొలివెలుగు) : మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులు, తల్లిదండ్రులకు జైలు శిక్ష తప్పదని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రణీత్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా త్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జయశ్రీ ఫంక్షన్ హాల్‌లో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు పూర్తయ్యాక లైసెన్స్ పొందిన తర్వాతే వాహనం నడపాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి మైనర్లు వాహనాలు నడిపితే భారీ జరిమానాలతో పాటు రెండేళ్ల జైలు శిక్ష విధించే అవకాశముందని చట్టంలోని సెక్షన్లతో సహా వివరించారు. చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా 30 సంవత్సరాల లోపు యువతే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా విద్యార్థులు వారిపై ఒత్తిడి చేయాలని, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో త్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, త్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, సమన్వయకర్తలు మాలిక్, శివరాణి, శ్రీవాణి, శ్రీదేవితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత..!

- పంతంగి వద్ద 'అరైవ్ అలైవ్' కార్యక్రమం
- ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్



చౌటుప్పల్, జనవరి 21 (తొలివెలుగు) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ సూచనలతో బుధవారం పంతంగి వద్ద 'అరైవ్ అలైవ్' పేరుతో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, పోలీస్ సిబ్బంది, వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# కారుణ్యానికి కేరాఫ్.. 'భాస్కర్ ఫౌండేషన్' అభయం!

- నడకను దూరం చేసిన ప్రమాదం.. మళ్ళీ నిలబెట్టిన మానవత్వం..
- కలవలపల్లి యువకుడికి 'కృత్రిమ కాలు'
- ఆదర్శంగా నిలిచిన ఇరుగదిండ్ల భాస్కర్






చౌటుప్పల్, జనవరి 21 (తొలివెలుగు): రోడ్డు ప్రమాదం ఒక నిరుపేద కుటుంబానికి ఆధారమైన యువకుడి నడవడికను దూరం చేసింది. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్న ఆ కుటుంబానికి ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకుంది. మునుగోడు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన వంటేపాక గణేష్ వాటర్ ప్యూరిఫైయర్ టెక్నీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తండ్రి దశరథ ముంబైలో కూలి పనులు చేస్తుండగా, గణేష్ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే నాలుగు నెలల క్రితం దేవరకొండలో పని ముగించుకుని తిరిగి వస్తుండగా నల్గొండ సమీపంలో కారు ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో గణేష్ కుడి కాలు కోల్పోయాడు. కాలు కోల్పోవడంతో ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడటంతో గణేష్ తీవ్రంగా మనోవేదనకు గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ స్పందించి, గణేష్‌కు అభయహస్తం అందించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అతనికి కృత్రిమ కాలు ఉచితంగా అమర్చి, మళ్లీ నడిచే ధైర్యాన్ని అందించారు. ఈ సందర్భంగా ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో గణేష్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. పేదరికం కారణంగా ఎవ్వరూ విద్య, వైద్యం, ఉపాధికి దూరం కాకూడదన్నదే తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

## - అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

యాదాద్రి భువనగిరి, జనవరి 21 (తొలివెలుగు): బాలకార్మికులను పనుల్లో పెట్టుకుంటే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మినీ మీటింగ్ హాల్‌లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ స్మైల్' సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌తో పాటు అడిషనల్ డీసీపీ లక్ష్మి నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ.. 0 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలను ఎక్కడ పనుల్లో పెట్టుకున్నా లేదా వెట్టి చాకిరీ చేయించినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జనవరి నెల నుంచి ఇప్పటివరకు 97 మంది బాల కార్మికులను రెస్క్యూ చేసినట్లు తెలిపారు. 'ఆపరేషన్ ముస్కాన్', 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో 'ఆపరేషన్ స్మైల్' కింద మూడు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని, 18 సంవత్సరాల



లోపు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే ఎఫ్ఐఆర్ నమోదు చేసి యజమానిని ఏ1గా, మేస్త్రీని ఏ2గా, సంబంధిత పరిశ్రమల సూపర్వైజర్‌ను ఏ3గా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పరిశ్రమల యజమానులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని, పరిశ్రమలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూడబ్ల్యూసీ, జేజేబీ సిబ్బంది, బీఆర్‌బీ కోఆర్డినేటర్ అనంతలక్ష్మి, జిల్లా డీఎంహెచ్ఓ అధికారి మనోహర్, ఏడి ప్రశాంత్ రెడ్డి, పోలీస్ శాఖ సిబ్బంది, ఎన్‌జీఓ ప్రతినిధులు, చైల్డ్ హెల్ప్ లైన్, సీసీఐ సిబ్బంది, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గురువారం ప్రత్యేక గ్రీవెన్స్ రద్దు

## - జిల్లా కలెక్టర్ హనుమంతరావు



భువనగిరి కలెక్టరేట్, జనవరి 21 (తొలివెలుగు): ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్, ఉద్యోగవాణి కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 22న గురువారం జరగాల్సిన గ్రీవెన్స్, ఉద్యోగవాణి కార్యక్రమం నిర్వహించబోమని స్పష్టం చేశారు. అందువల్ల ప్రజలు మరియు ఉద్యోగులు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని ఆయన సూచించారు. ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం రద్దు విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రాణ రక్షణ కోసం.. ప్రజా క్షేత్రంలోకి!

- ధ్వంసమైన రోడ్డుపై అశోక్ నాయక్ గర్జన..
- జనని స్వచ్ఛంద సంస్థ సంఘీభావం.
- గుండ్లగూడెం - పెంబర్తి రహదారిపై యువనేత

ఆలేరు, జనవరి 21 (తొలి వెలుగు) : ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా రోడ్డు భద్రత సమస్యలపై పోరాటానికి ముందుకు వచ్చిన యువ నాయకుడు, జిల్లా ఎల్‌హెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి మూడవత్ అశోక్ నాయక్ రోడ్డు పునరుద్ధరణ కొరకు నిరసన దీక్ష చేపట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని గుండ్లగూడెం రైల్వే గేట్ నుండి పెంబర్తి రైల్వే గేట్ వరకు ఉన్న తారు రోడ్డును వాహనాల తాకిడితో తీవ్రంగా దెబ్బతినడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ రోడ్డును వెంటనే పునరుద్ధరించి ప్రజా అవసరాల కోసం వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షకు జనని స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా జనని స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్, చైర్మన్ మైదం భాస్కర్ మాట్లాడుతూ, ప్రజా సౌకర్యార్థం నిర్మించిన రోడ్లను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. నిరసన దీక్షలో పాల్గొన్న మూడవత్ అశోక్ నాయక్ మాట్లాడుతూ, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడానికి కూడా వెనకాడబోనని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి జనని స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పేరపు ఆనంద్, కన్వీనర్ కమలాకర్ కుంతావత్‌తో పాటు సంస్థ సభ్యులు జూకంటి సంపత్, జూకంటి కృష్ణ, కుందే గణేష్,






పడకంటి చంద్రశేఖర్, మద్దూరి శ్రీకాంత్ పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు.

# రోడ్డు భద్రతే ప్రాణ రక్ష..

- 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన
- ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్






చౌటుప్పల్, జనవరి 21 (తొలివెలుగు) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్‌ఉ2026'లో భాగంగా బుధవారం చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలను పాటించడమే ప్రాణ రక్ష అని అన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించే రాయబారులుగా మారాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అజయ్ భార్గవ్, ఏఎంవీఐలు హర్షవర్ధన్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం పట్టివేత

- పక్కా సమాచారంతో పోలీసుల తనిఖీ
- భారీగా మద్యం బాటిళ్ల స్వాధీనం






వలిగొండ, జనవరి 21 (తొలివెలుగు) : వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, రెడ్లరేపాక గ్రామానికి చెందిన పంతంగి వెంకటేష్ నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో తనిఖీ చేయగా, అక్కడ 81 లీటర్ల అక్రమ మద్యం బాటిళ్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ. 61,473 ఉంటుందని తెలిపారు. ఈ ఘటనపై దుకాణ యజమాని పంతంగి వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.

Toli Velugu 22.01.26_Layout 1 1/22/2026 8:38 AM Page 5



# పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి

- లింగోటంలో సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కుల పంపిణీ
- సర్పంచ్ బీమిడి ప్రదీప్ జీ



చౌటుప్పల్, జనవరి 21 (తొలివెలుగు ): అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్వాములవారి లింగోటం గ్రామంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫారసుతో మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ బీమిడి ప్రదీప్ జీ, పల్చం శ్రీనివాస్, కుర్నాల నర్సింహా, గోండే రాములు, రాచకొండ సైదులు, జెల్ల శ్రీనివాస్‌లకు ఈ ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బీమిడి ప్రదీప్ జీ, గ్రామ శాఖ అధ్యక్షుడు శివకృష్ణ, అంజయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘అక్షిత‘ దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

❖ ప్రజల పక్షాన నిలవాలి - డీపీఆర్ఓ అరుంధతి



జిల్లా ఎస్పీ కార్యాలయంలో

భువనగిరి, జనవరి 21 (తొలివెలుగు): అక్షిత దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టరేట్‌లోని పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో డీపీఆర్ఓ అరుంధతి బుధవారం ఆవిష్కరించారు. అలాగే జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అక్షాంశ్ యాదవ్, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కృష్ణారెడ్డిలు వేర్వేరుగా క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీపీఆర్ఓ మాట్లాడుతూ.. పత్రికలు నిస్వార్థంగా, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను వెలికితీస్తూ అక్షిత పత్రిక ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పత్రికా ప్రతినిధులు సురేష్, శ్రీనివాస్, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.




జిల్లా డిపిఆర్ఓ కార్యాలయంలో



భువనగిరి ఆర్డీవో కార్యాలయంలో

# మద్యం మహమ్మారిపై ‘మునుగోడు‘ పోరు!

- బెల్ట్ షాపుల నిర్మూలనకు కదులుతున్న పల్లెలు
- ఎమ్మెల్యే సంకల్పానికి ప్రజల మద్దతు




మునుగోడు, జనవరి 21 (తొలివెలుగు) : మునుగోడు నియోజకవర్గంలో మద్యం నియంత్రణ దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రజల ఆరోగ్యం, కుటుంబాల క్షేమమే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ఇప్పుడు నియోజకవర్గవ్యాప్తంగా సామాజిక ఉద్యమంగా మారుతోంది. “పగలంతా కష్టపడి పని చేయాలి.. సూర్యాస్తమయం తర్వాతే విశ్రాంతి“ అనే ప్రకృతి సూత్రాన్ని పాటిస్తూ, పగటిపూట మద్యం విక్రయాలపై ఆయన విధించిన ఆంక్షలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. గతంలోనే బెల్ట్ షాపులు రద్దు చేసిన గ్రామాలకు రూ. 5 లక్షల ప్రోత్సాహకాన్ని ప్రకటించిన రాజగోపాల్ రెడ్డి, ప్రస్తుత నూతన మద్యం పాలసీలోనూ కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. మధ్యాహ్నం 1 గంటకే షాపులు తెరవాలని, సాయంత్రం 6 గంటల తర్వాతే పర్మిట్ రూములు ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. దీనిపై వ్యాపారులు విన్నవించినా, ప్రజా హితం దృష్ట్యా ఆయన వెనక్కి తగ్గలేదు. తాజాగా గట్టుప్పల్ మండలం వెల్మకన్నే వంటి గ్రామాల్లో యువత స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహిస్తూ, కిరాణా షాపుల్లో అక్రమంగా మద్యం అమ్మేవారికి కౌన్సిలింగ్ ఇస్తుండటం నియోజకవర్గంలో మారుతున్న సామాజిక ముఖచిత్రానికి అద్దం పడుతోంది.

# ఐద్వా మహాసభకు మహిళలు భారీగా తరలిరావాలి



భువనగిరి, జనవరి 21 (తొలివెలుగు) : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభల సందర్భంగా ఈ నెల 25న హైదరాబాద్‌లోని బస్సు భవన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఇంటికో మహిళ తరలిరావాలని ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి పిలుపునిచ్చారు. బుధవారం భువనగిరి మండల పరిధిలోని వడపర్తి గ్రామంలో ఐద్వా మహాసభల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ, మహిళల హక్కుల రక్షణ, సంక్షేమం, భద్రత, గౌరవం కోసం ఐద్వా నిరంతరం మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, వేధింపులపై రాజీ లేకుండా ఐద్వా పోరాడుతుందని పేర్కొన్నారు. మహిళలను రెండో తరగతి పౌరులుగా చూస్తున్న ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. స్త్రీ, పురుషులు సమానులే అయినప్పటికీ పాలక వర్గాలు మత భావాలను రెచ్చగొట్టి మహిళలను వంటింటికే పరిమితం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. పార్లమెంట్, అసెంబ్లీలలో 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని, పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలని, మహిళలుఉబాలికలకు పౌష్టికాహారం, ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లింగవివక్ష నిర్మూలన దిశగా ప్రభుత్వాలు చట్టసభల్లో స్పష్టమైన పురోగతి చూపాలని కోరారు. ఈ సమస్యల సాధన కోసం మహాసభల్లో విస్తృత చర్చలు జరిపి ఉద్యమాలు రూపొందించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళల శక్తిని ప్రభుత్వాలకు తెలియజేయడానికి ఈ నెల 25న నిర్వహించనున్న బహిరంగ సభకు వేలాదిగా మహిళలు తరలివచ్చి ఐక్యతను ప్రదర్శించాలని నాగమణి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉడుత అండమ్మ, భానుప్రియ, బొబ్బిలి స్వాతి, అనిత, తుమ్మల సత్యలక్ష్మి, జూపల్లి మాధవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# మాదారం గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం - 70 పశువులకు వైద్య సేవలు

జనగామ జిల్లా / రఘునాథపల్లి, జనవరి 21 (తొలివెలుగు) : రఘునాథపల్లి మండలంలోని మాదారం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వరంగల్ మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఆరూరి సరితఉమల్లేశం ప్రారంభించగా, గ్రామానికి చెందిన పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొత్తం 70 పశువులను చికిత్స కోసం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా స్థానిక వెటర్నరీ వైద్యురాలు డా. అసిఫా పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆడ దూడలు పుట్టేలా లింగ నిర్ధారణ చేసిన సెమెన్ గోపాలమిత్రుల వద్దతో పాటు ఇతర అందుబాటులో ఉన్న కేంద్రాలలో లభ్యమవుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సూపర్వైజర్ ఏళ్ల జయపాల్ రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులు చూడు నిల్వ సమస్యలు ఉన్న పశువులను ఇటువంటి శిబిరాలకు తీసుకొచ్చి సకాలంలో చికిత్స చేయించుకోవాలని, అలాగే పశువులకు పచ్చి గడ్డి, మినరల్ మిక్చర్ తప్పనిసరిగా అందించి ఆరోగ్యంగా చూసుకోవాలని తెలిపారు. ఈ శిబిరంలో విజయ పాలకేంద్రం అధ్యక్షులు బి. నాగరాజు, వెటర్నరీ అసిస్టెంట్ కవిత, గోపాలమిత్రులు పి. యాకన్న, సిహెచ్. కుమారు, పశుమిత్ర సరళ, గ్రామ పాడి రైతులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.



